ప్రమాదకరంగా మలుపులు



పంగిడిపల్లి శివారులో ప్రమాదకరంగా ఉన్న మలుపు



వెలిశాల శివారులో..

- ఏర్పాటు చేయని హెచ్చరిక బోర్డులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

టేకుమట్ల: మండలంలోని ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్లలో మలుపుల వద్ద అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన రోడ్లకు ఇరు వైపులా పిచ్చి మొక్కల ఏపుగా పెరగడంతో మలుపుల వద్ద ఎదుటి వాహనాలను గుర్తించలేనంత ప్రమాదకరంగా మారాయి. అధికారులు పట్టించుకోక పోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులతో పాటు గ్రామాల ప్రవేశ సమీపంలో ఎక్కడ కూడా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనాల వేగాన్ని నియంత్రించకుండా అంతే వేగంతో గ్రామాల కూడళ్లలో సైతం వెళ్లడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. టేకుమట్ల మండలంలోని ఆశిరెడ్డిపల్లి-పంగిడిపల్లి మలుపుల వద్ద గతంలో పలు ప్రమాదాలు జరిగి కొంత మంది గాయపడగా, రామకిష్టాపూర్(వి) గ్రామానికి ఇద్దరు యువకులు, గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. పంగిడిపల్లి-వెలిశాల ప్రధాన రోడ్డులో శ్రీరేణుకా ఎల్లమ్మ గుడి సమీపంలోని మలుపు వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ఇప్పటి వరకు అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. అలాగే రాఘవరెడ్డిపేట-ఇప్పలపల్లి గ్రామాల మధ్య మలుపు వద్ద ఇప్పలపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి బస్సు ఢీకొని మృతి చెందాడు. గర్మిళ్లపల్లి-ఓడేడ్ ప్రధాన రోడ్డు డబుల్ బెడ్రూంల సమీపంలోని మలుపు వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడడంతో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. ఇలా నిత్యం మండలంలో ప్రమాదాలు జరుగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కాలు విరిగింది



గత సంవత్సరం వ్యక్తిగత పని మీద హనుమకొండకు వెళ్లి వస్తుండగా పరకాల మండలం నాగారంలో మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని కాలు విరిగింది. అదృష్టవశత్తు ప్రాణాలతో బయటపడ్డాను. అప్పటి నుంచి మలుపులు రాగానే చాలా భయంగా అనిపిస్తుంది.

- దూడం భిక్షపతి, టేకుమట్ల

జాగ్రత్తగా ఉండాలి



మలుపుల వద్ద వాహనదారులు జాగ్రత్తగా వాహనాలను నడుపుతూ వేగాన్ని తగ్గించాలి. వేగంగా మలుపుల వద్ద ప్రయాణం చేస్తే అదుపు తప్పి పడిపోవడంతో పాటు, ఎదురుగా వచ్చే వాహనాల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఢీకొనే ప్రమాదం ఉంటుంది.

- దాసరి సుధాకర్, ఎస్సై, టేకుమట్ల

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

- ప్రిన్సిపాల్ విజయదేవి



ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

మల్హర్: అర్హులైన అధ్యాపకులతో నాణ్యమైన ఉచిత విద్య అందిస్తున్న ప్రభుత్వ కళాశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ప్రిన్సిపాల్ విజయదేవి కోరారు. స్థానిక తాడిచర్ల ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు పదో తరగతి పాసైన విద్యార్థులను శుక్రవారం నేరుగా కలిసి అడ్మిషన్లు పొందాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నట్లు విద్యార్థులకు వివరించారు. తాడిచర్ల కళాశాలలో అడ్మిషన్ తీసుకొని వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆమె కోరారు. కళాశాలలో అడ్మిషన్ల కోసం 90004 99156, 98494 68236 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కష్టపడిన కార్యకర్తలకు సముచిత స్థానం



కాటారం: మాట్లాడుతున్న నాయకులు

కాటారం: కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు మంత్రి శ్రీధర్‌బాబు సముచిత స్థానం కల్పించడానికి కృషి చేస్తున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, సీనియర్ నాయకుడు నవీన్‌రావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబు పార్టీ నాయకులకు పదవులు ఇవ్వకుండా కుటుంబ సభ్యులకు కట్టబెడుతున్నారని పుట్ట మధు వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదకం అన్నారు. 25 సంవత్సరాలుగా మంథని నియోజకవర్గ ప్రజల కోసం కృషి చేస్తున్న శ్రీనుబాబు సేవలను గుర్తించిన అధిష్టానం టీపీసీసీలో అవకాశం కల్పించదన్నారు. ఈ సమావేశంలో మహిళా మండల అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, యూత్ అధ్యక్షుడు చిటూరి మహేశ్‌గౌడ్, అంగోతు సుగుణ, తెప్పెల దేవేందర్‌రెడ్డి, దబ్బెట రాజేశ్, కొట్టె ప్రభాకర్, అంగజాల అశోక్, భూపెల్లి రాజు, కడారి విక్రమ్, గడవేణ దేవేందర్‌యాదవ్ ఉన్నారు.

'బానిసలం కాదు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలం'

కాళేశ్వరం: తాము బానిసలమం కాదని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలమని మహదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ తమ నాయకులపై కపటప్రేమ నటిస్తూ అర్థంలేని ఆరోపణలు చేశాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తనను ఎన్నడూ విస్మరించలేదని పార్టీలో తనకు అత్యున్నత స్థానంతో పాటు సరైన గుర్తింపునిచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న శీనుబాబును పదవి వస్తే విమర్శించడం తగదన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 33/11 స్టేషన్ మరమ్మతుల కారణంగా భూపాలపల్లి, జంగేడు సబ్ స్టేషన్ల పరిధిలో నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ విశ్వాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూపాలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8:00 గంటల నుంచి ఉదయం 9:30 గంటల వరకు, జంగేడు సబ్ స్టేషన్‌లో పరిధిలో ఉదయం 9:30 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహదేవపూర్‌లో..

కాళేశ్వరం: మహదేవపూర్, కాళేశ్వరం సబ్‌స్టేషన్ల పరిధిలో నేడు(శనివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు మెయింటనెన్స్, మరమ్మతుల కారణంగా సరఫరా నిలుపుతున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన తెలిపారు.

బోర్డుల ఏర్పాటు



ఏర్పాటు చేసిన స్టాప్ బోర్డులు

సాక్షి ఎఫెక్ట్..

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం దేవస్థానంలో తూర్పు రాజగోపురం వెళ్లు మెట్ల వద్ద సూచిక బోర్డులు లేక నిత్యం వాహనాలు అదుపు తప్పి దూసుకువస్తున్నాయి. దీంతో 'సూచిక బోర్డులు లేక.. డ్రైవర్లు తికమక' అనే శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం కథనం ప్రచురించింది. ఈ మేరకు దేవస్థాన అధికారులు స్పందించి మెట్ల మార్గం వద్ద స్టాప్ బోర్డులను ఏర్పాటు చేశారు.

హామీలు నెరవేర్చాలి



ప్రార్థనలు చేస్తున్న ఉద్యమకారులు

కాళేశ్వరం: సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహదేవపూర్ మండల అధ్యక్షుడు సట్ల సత్యనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆయూబోద్దీన్ ఆధ్వర్యంలో స్థానిక జామా మజీద్‌లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉద్యమ నాయకులు మండల ప్రధాన కార్యదర్శి ఎండీ అక్రమోద్దీన్, ఇర్షాద్, గయాస్, బషీర్ ఖాన్, రఫీ, వామన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని ఎస్సీ న్యాయవాద పట్టభద్రులకు 2025–26 సంవత్సరానికి గాను వృత్తిలో శిక్షణ పొందుటకు కొత్తగా న్యాయవాద పట్ట వచ్చిన ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో శిక్షణ సదుపాయాలు పొందని వారు మాత్రమే అర్హులన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నారాయణరెడ్డి

కాటారం: మహాముత్తారం మండలం ములుగుపల్లిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు యూత్ నాయకులు దేవేందర్, రాకేశ్, కృష్ణ, దేవేందర్ శుక్రవారం బీజేపీలో చేరారు. బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం మండల అధ్యక్షుడు పాగె రంజిత్, ములుగుపల్లి బీజేపీ నాయకుడు అనిల్‌రెడ్డి రాజయ్య, దుర్గం తిరుపతి, జిల్లెల శ్రీశైలం, నరేశ్, అరుణ్, రాజేశ్, తిరుపతిరెడ్డి, డాక్టర రఫీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అమ్మితే కేసులు

చిట్యాల: పీడీఎస్ బియ్యాన్ని అమ్మినా, కొనుగోలు చేసిన కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ షేక్ ఇమామ్ బాబా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఉచిత సన్న బియ్యాన్ని లబ్ధిదారులు దళారులకు అమ్ముకున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లయితే సంబంధిత లబ్ధిదారులపై క్రిమినల్ చర్యలు చేపట్టి వారి రేషన్‌కార్డు తొలగిస్తామని అన్నారు.

'భూ భారతి'ని సద్వినియోగం చేసుకోవాలి



టేకుమట్ల: మాట్లాడుతున్న ఆర్డీఓ రవి



భూపాలపల్లి రూరల్: జంగేడులో..

- ఆర్డీఓ రవి

టేకుమట్ల: భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ రవి అన్నారు. శుక్రవారం మండలంలోని పంగిడిపల్లిలో తహసీల్దార్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరు కానీ వారు ఈ నెల 23న తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. అనంతరం రెవెన్యూ అధికారలకు రెవెన్యూ సదస్సులపై పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ ఆర్ఐ సంతోష్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్,జూనియర్ అసిస్టెంట్ పొనగంటి బాబు, బట్టల కుమార్, రఘుపతి ఉన్నారు.

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపల్‌పరిధిలోని జంగేడు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. అంజలిరెడ్డి, రామస్వామి, హజరోద్దీన్, రాజు, రాజ్యలక్ష్మి, రజిత పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్యాభ్యాసం



కాటారం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీణ

కాటారం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాభ్యాసం అందించడం జరుగుతుందని ఐసీడీఎస్ గంగారం సెక్టార్ సూపర్ వైజర్ వీణ అన్నారు. మండలంలోని గంగారం సెక్టార్ పరిధిలోని గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలు, విద్య గూర్చి చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోషన శక్తి కోఆర్డినేటర్‌లు అనూష, మమత, అంగన్‌వాడీ టీచర్ సువర్ణ, ఆయా చంద్రమ్మ పాల్గొన్నారు.

పలిమెల: అంగన్‌వాడీ పరిధిలోని ప్రతీ ఇంటిని సందర్శించి రెండు నుంచి మూడు సంవత్సరాల పిల్లలను గుర్తించి ప్రతీ ఒక్కరిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించేలా చూడాలని సిబ్బందికి సీడీపీఓ రాధిక సూచించారు. శుక్రవారం మండలంలోని బూరుగూడెం, పంకెనల్లో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ రాధిక మాట్లాడుతూ.. పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అభ్యసించడానికి కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా అవసరమైన బోధన సామగ్రి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉందని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ సమ్మయ్య, సూపర్‌వైజర్ శివరాణి, టీచర్ శివమ్మ, తదితరులు పాల్గొన్నారు.



పలిమెల: మాట్లాడుతున్న సీడీపీఓ రాధిక



టేకుమట్లలో..

టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్(టి)లో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట ర్యాలీ కార్యక్రమాన్ని శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, అనిత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటను వేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారంతో పాటు, ప్రీ ప్రైమరీ విద్యాభ్యాసం, ఆటలు నేర్పిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఓనపాకల రవిందర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ ఆయాలు, తల్లులు, ఉన్నారు.

నేటినుంచి సామాజిక తనిఖీలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు నేటి(శనివారం) నుంచి స్టేట్ రిసోర్స్ పర్సన్ గంగరాజు ఆధ్వర్యంలో మూడు రోజులపాటు పర్యటించి తనిఖీ చేయనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు చేసిన చెల్లింపుల వివరాలను ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఆయన శుక్రవారం వెల్లడించారు. రూ.4,65,62,098 పనులకుగాను వేతన రూపంలో రూ.3,32,24,593లు, మెటీరియల్ రూపంలో రూ.1,33,37,505లను చెల్లింపులు చేసినట్లు తెలిపారు. చెల్లింపులు చేసిన డాక్యుమెంట్లు పూర్తిగా ఆడిట్ బృందానికి మూడు రోజులపాటు అప్పగించినట్లు తెలిపారు. దీనికి సంబంధించి తనిఖీ బృందం పనులను ప్రత్యక్షంగా పరిశీలించి, కొలతలను చూసి, పనిచేసిన జాబు కార్డుదారులను వ్యక్తిగతంగా కలిసి తనిఖీ నిర్వహించనున్నారు. పీఓ సునీత, రమేశ్, ఎస్ఆర్పీ గంగరాజు ఉన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన



కొత్తపల్లిగోరిలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ



మల్హర్: యూనిఫామ్స్ ఇస్తున్న ఉపాధ్యాయులు



మొగుళ్లపల్లి: విద్యార్థులతో ఎంఈఓ

- ఎంఈఓ రాజు

రేగొండ (కొత్తపల్లిగోరి): ప్రభుత్వ బడులల్లో ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన ఉంటుందని, తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంఈఓ రాజు అన్నారు. శుక్రవారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సాముహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత, ఉపాధ్యాయులు నవీన్ కుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఎస్సీకాలనీ, రామరావుపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు అరుణ్‌కుమార్, పద్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ అందించారు. ఈ కార్యక్రమంలో తాడిచర్ల జెడ్పీహెచ్‌స్ కాంప్లెక్స్ హెచ్‌ం తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయుడు సురేష్, సీఆర్‌పీ సమత, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్స్ సరిత, మీనా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: గొల్లబుద్దారంలో..

గణపురం: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దూలం కుమారస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ ఉప్పలయ్య హాజరయ్యారు. నూతనంగా పాఠశాలకు వచ్చిన పిల్లలకు వారి తల్లితండ్రుల సమక్షంలో అర్చకుడు వేణుగోపాల చార్యుల చేతుల మీదుగా అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ దూడపాక రజితతో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

మొగుళ్లపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ లింగాల కుమారస్వామి అన్నారు. మండలంలోని నర్సింగాపూర్, మొట్లపలిపపెద్దకోమటిపల్లి, పిడిసిల్ల, ములకలపల్లి, తదితర పాఠశాలల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నసీరోద్దీన్ అధ్యక్షతన నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమానికి ఎంఈఓ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యత సాధిస్తారన్నారు. వేములపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భిక్షపతి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అనసూర్య, పంచాయతీ కార్యదర్శి రాధిక, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: మండలలోని గొల్లబుద్దారంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బడి బాట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులను ఏపీపీ అధ్యక్షురాలు సునీతతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ఉపాధ్యాయులు మానస, మల్లేశ్వరి, వాసు పాల్గొన్నారు

విద్యుత్ ఉపకేంద్రాల అనుసంధానం

మొగుళ్లపల్లి: మండలంలోని వేములపల్లిలో 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రంను, హనుమకొండ జిల్లా పరకాల మండలంలోని వెంకటేశ్వర్లపల్లే 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి నూతన విద్యుత్ లైన్ వేసి శుక్రవారం అనుసంధానం చేశారు. దీంతో మొట్లపల్లి, చిట్యాల విద్యుత్ ఉపకేంద్రాల్లో అంతరాయం కలిగితే నూతన లైన్ ద్వారా ఇద్యుత్ వినియోగించుకోవచ్చాని అధికారులు తెలిపారు. సీఈ రాజు చౌహాన్, ఎస్ఈ మల్హూర్, డీఈ సదానందం, ఏడీఈ సందీప్, ఏఈ సంజీవ్ పాల్గొన్నారు.

ఎస్టీఓను నియమించాలి

కాళేశ్వరం: మహదేవపూర్ సబ్‌ట్రెజరీ కార్యాలయంలో పూర్తి కాలపు ఎస్టీఓ లేకపోవడంతో ఐదు మండలాల ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని డీటీఎఫ్ మండల అధ్యక్షుడు మడక మధు, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సారంగపాణి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ట్రెజరి కార్యాయంలో ప్రస్తుతం ఉన్న అధికారి ఆఫీసులో అందుబాటులో ఉండడం లేదని తెలిపారు. దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి తక్షణమే పూర్తి కాలపు ఎస్టీఓను నియమించాలని కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



కాటారం: సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్సై

చిట్యాల: మండలంలోని జడలపేట గ్రామానికి చెందిన దొడ్ల రమణారెడ్డి ఎనిమిది నెలల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో అతడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి శుక్రవారం హెడ్ కానిస్టేబుల్ చంద్రమౌళి అందజేశారు.

కాటారం: మండల కేంద్రానికి చెందిన సింధూజ, మండలంలోని గారెపల్లికి చెందిన బాలచందర్, పోతుల్వాయికి చెందిన రవీందర్ ఇటీవల సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. ఈ మేరకు వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన పోలీసులు సెల్‌ఫోన్‌లను రికవరీ చేశారు. బాధితులకు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై అభినవ్ సెల్‌ఫోన్‌లను అప్పగించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వాజేడు : పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచు కోవాలని ప్రగళ్లపల్లి పల్లె దవాఖాన వైద్యాధికారిని గ్నానస అన్నారు. కలెక్టర్ దివాకర, జిల్లా వైద్యాధికారి గోపాలరావు ఆదేశాల మేరకు మండలంలోని బొల్లారం గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించినట్లు తెలిపారు. 52 మందిరోగులను పరీక్షించి మందులను అందించడంతో పాటు పలు సూచనలను చేశారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలు రాకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమలను అరికట్టడం మూలంగానే జ్వరాలు రాకుండా జాగ్రత్త పడవచ్చని వివరించారు. ఎలాంటి అనారోగ్యానికి గురైనా ప్రభుత్వ వైద్యశాలకు రావాలని సూచించారు. కార్యక్రమంలో కోటిరెడ్డి, వెంకట రమణ, శ్రీనివాసరావు, కన్యాకుమారి, కాంత తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు నిరుపేదలకు ఇవ్వాలి



మాట్లాడుతున్న రవీందర్

చిట్యాల: ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం రవీందర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పేదల పేర్లు తొలగించి భూస్వామి పేరు పెట్టడం సర్దైంది కాదని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు , సంబంధితులకు మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎరుకొండ రాజేందర్, రవీందర్ రావు, దామెర రాజు, తదితరులు పాల్గొన్నారు.